బాల్య వివాహలతో అనర్థాలు

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: బాల్య వివాహాలు వలన అనర్థాలు ఏర్పడతాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ అనురాధ అన్నారు. శుక్రవారం వీ.టి అగ్రహారం నాలుగవ అంగన్వాడి కేంద్రం పరిధిలో ఉన్న కిషోర్ బాలికలకు బాల్య వివాహాలపై మహిళా సంరక్షణ కార్యదర్శి కళ్యాణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనురాధ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత మగపిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం జరిపించాలని తెలిపారు. విద్య, కెరీర్, లక్ష్యంగా పెట్టుకుని లక్ష సాధన అనంతరం వివాహాలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సత్యవతి, లలిత కుమారి పాల్గొన్నారు.

లోకం మాధవి నేతృత్వంలో ప్రజావేదిక

విశాలాంధ్ర - భోగాపురం: భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి నేతృత్వంలో "వినతి సమీక్ష కార్యక్రమం" నిర్వహించారు. నెల్లిమర్ల నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్ బుర్లె శ్రీధర్ ఎమ్మెల్యేతోపాటు వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు రోడ్లు, తాగునీటి కొరత, పెన్షన్ సమస్యలు, భూ వివాదాలు, విద్యుత్ అంతరాయాలు సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. సమస్యలు వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ భోగాపురం మండల కోఆర్డినేటర్లు పల్లంట్ల జగదీష్, పల్లా రాంబాబు పాల్గొన్నారు.

పుస్తకహుండీకి విశేష స్పందన

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: జిల్లా గ్రంథాలయ సేవా సంఘం నిర్వహిస్తున్న పుస్తక హుండీ కార్యక్రమానికి దాతల నుండి విశేష స్పందన లభిస్తుందని సంఘం ఉపాధ్యక్షులు కె.దయానంద్, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్‌లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ దిమిలి అచ్యుతరావు తన ఇంట్లో వున్న వివిధ రకాల పుస్తకాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో తమను సంప్రదించిన మేరకు వారి ఇంటికి వెళ్లి పుస్తకాలను స్వీకరించామని అన్నారు. పుస్తక హుండీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ఇలా సేకరించిన పుస్తకాలను వివిధ గ్రంథాల యాలకు, విద్యార్థులకు అందజేస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు వేలాది పుస్తకాలను దాతల నుండి సేకరించామని అన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని గత ఏడాది 2024 - 25 విద్యా సంవత్సరంనకు గాను నిర్వహించిన 10వ తరగతి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను మండల విద్యాశాఖాధికారి ఎన్.నాగభూషణరావు శుక్రవారం పరిశీలించారు. వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన తరగతులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలిపల్లిమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట

విశాలాంధ్ర - గుర్ల: మండలంలోని పాలవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలిపల్లి తల్లి ఆలయ ప్రతిష్ట శుక్రవారం నిర్వహించారు. ఉదయం11:54 నిమిషాలకు హస్త నక్షత్రన అభిజిత్ లగ్న మందు పోలిపల్లిమ్మ తల్లి ఆలయం, విగ్రహం శిఖర ప్రతిష్ట నిర్వహించారు. 12 గంటల నుండి భారీ అన్న సమరాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పొట్నూరు సన్యాసినాయుడు, సర్పంచ్ వల్లూరు రాము, గ్రామ పెద్దలు బుర్లె శ్రీనివాసరావు, పెనుమజ్జి అప్పలనాయుడు, చందక సూర్యనారాయణ, గేదెల అప్పలనాయుడు, వల్లూరు భాష, గేదెల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే అదితి

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో "ప్రజాదర్బార్" నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన హౌసింగ్, పింఛన్లు, రోడ్లు, కాలువలు, విద్యుత్ వంటి అనేక అంశాలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 35వ డివిజన్‌లో విద్యుత్ స్తంభాలు పాతవి అవ్వడం వలన వాటి స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలు వేయాలని, నీటి కొరత ఉన్నందున బోర్లు వెయ్యాలని, శ్మశాన వాటిక జెసిబితో శుభ్రం చేయించాలని పైలా మహేష్ వినతి అందించారు.

పీఎం సురక్ష మాతృత్వ అభియాన్

విశాలాంధ్ర - దత్తిరాజేరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోరపు కొత్తవలసలో డాక్టర్ కె రఘు, గైనకాలజిస్ట్ పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 22 మంది గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు, రక్తపరీక్షలు నిర్వహించారు. గర్భిణీలు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్.చింతలవలస సాయిరాం భక్తులు పద్మావతి మరికొంతమంది భక్తులు కలిసి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డివి గిరిబాబు, ఎంపిహెచ్ఓ బి.మురళి, హెల్త్ సూపర్‌వైజర్ పి.లక్ష్మి, ఆర్.శ్రీనివాసరావు తదితరలు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర

విశాలాంధ్ర - తెర్లాం: శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర" రథం మండలంలో శుక్రవారం విజయరాంపురం ఏబూరిపేట గ్రామానికి చేరుకుంది. శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బొత్స అప్పలస్వామి నాయుడు మాస్టర్ జెండా ఊపి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూరి మధుసూదనరావు, శ్రీ సత్యసాయి బాబా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యువత పారిశ్రామిక రంగాల్లో ఎదగాలి: మంత్రి కొండపల్లి

బలిఘట్టంలో 57.09 ఎకరాల్లో ఎం.ఎస్.ఎం.ఇ పార్కుకు శంకుస్థాపన

విశాలాంధ్ర - కొత్తవలస: సంక్షేమం.. అభివృద్ధితో పాటూ.. రాష్ట్రం ఆర్థికంగా ఎదగాలంటే పారిశ్రామిక రంగాలను ప్రోత్సాహించాలని, విద్యావంతులైన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిద్దాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లాకు మొదటివిడతలో మంజూరైన నాలుగు పార్కుల్లో, మొట్టమొదటి పార్కుకు కొత్తవలస మండలంలోని బలిఘట్టంలో శుక్రవారం మంత్రి కొండపల్లి చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోందని చెప్పారు. జిల్లాకు మొదటి దశలోనే నాలుగు పార్కులను మంజూరు చేశారని, వీటిని ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బలిఘట్టంలో మొదటి ఫేజ్‌లో భాగంగా సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ.7కోట్ల వ్యయంతో ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఎస్.ఎం.ఇ.పార్కులో మాన్యుఫాక్చరింగ్, ప్లాస్టిక్ రీసైక్లింగ్, గ్రాన్యూల్, ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, డ్రైవాష్ యూనిట్ లు, కార్గేటెడ్ బాక్స్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ప్యాకింగ్ తదితర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తూ భవిష్యత్‌లో సుమారు రూ.96 కోట్ల పెట్టుబడితో 76 చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని, 1500 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్, డిజెడ్ఎం జయచంద్ర, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జీఎం శ్రీధర్, సహాయ సంచాలకులు బి.రామకృష్ణ, స్థానిక తహశీల్దార్ బి.నీలకంఠరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, ఏఎంసీ చైర్మన్ సి.హెచ్. మల్లునాయుడు, సీనియర్ నాయకులు వల్లూరి జయప్రకాష్ బాబు, మాజీ సర్పంచులు గొరపల్లి రాము, కొరుపోలు అప్పారావు, టీడిపి నాయకులు కోళ్ల శ్రీను, గొంప దుర్గా ఉమేష్, మాకెన సీతారామపాత్రుడు (నవీన్), బొబ్బిలి అప్పారావు, కనకాల శివ, రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యుటీ చెల్లించాలి

విశాలాంధ్ర - నెల్లిమర్ల: రిటైర్డ్ జ్యూట్ కార్మికులకు లేబర్ కోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యుటీ చెల్లించాలని నియోజవర్గం కన్వీనర్ బుర్లె శ్రీధర్ అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విలేకర్లుతో మాట్లాడుతూ రిటైర్డ్ జ్యూట్ కార్మికులు గ్రాడ్యూటీ బకాయిలు అందక, ఇటు పింఛన్ అమలు జరగకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షులు మైపాడ ప్రసాద్ మాట్లాడుతూ లేబరు కోర్టు ఆదేశాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇంతవరకూ మండల మేజిస్ట్రేట్‌గా ఏమి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలన్నారు. కార్మికుల సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో తెలపాలన్నారు. అనంతరం తహశీల్దార్‌కి వినతి పత్రాన్ని అందజేసారు. ఈ కార్యక్రమంలో చందక గోవిందా, వెలిచేటి రమేష్ బాబు, దోమ నాగార్జున, కార్మికులు పాల్గొన్నారు.

17వ వార్డు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

విశాలాంధ్ర -రాజాం: మండలంలో 17వ వార్డులో నెలకొన్న పలు సమస్యలపై ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు టీడీపీ నేతలు వినతి అందించారు. వార్డు పరిధిలో టీచర్స్ కోలనీ, అమ్మవారికోలనీ, ఆదర్శనగర్ కాలనీలలో పలు సమస్యలు నెలకొన్నాయని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మరిపి జగన్మోహన్రావు, గంధి గోపి, పలువురు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఆలయాలకు బొత్స చైతన్య విరాళం

విశాలాంధ్ర - పూసపాటి రేగ: గోవిందపురం పంచాయతీ గులివెందిలపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పైడితల్లమ్మ తల్లి, శ్రీ బంగారమ్మ తల్లి, శ్రీ దుర్గమ్మ తల్లి ఆలయాలకు నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు బొత్స లక్ష్మణరావు తనయుడు బొత్స చైతన్య విరాళాన్ని అందజేశారు. ఆ గ్రామ దేవతల ఆలయ నిర్మాణం కొరకు 50000/- రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గుడి నిర్మాణ కమిటీ, బొత్స కుటుంబ సభ్యులు, అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

'ప్రజా దర్బార్ వినతులను పరిష్కరిస్తాం'

విశాలాంధ్ర - గంట్యాడ: మండల కేంద్రమైన గంట్యాడ టీడీపీ మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండలంకు చెందిన అనేక గ్రామాల ప్రజలు వారి వారి సమస్యలపై అనేకమైన వినతులను మంత్రికి సమర్పించారు. మండలానికి చెందిన నరవ గ్రామంలో రక్షిత మంచి నీటి పథకం ద్వారా ఇంటింటికి కుళా యిలు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల గతుకుల రోడ్లను బాగు చేయాలని నరవ గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు సుంకరి రామ నాయుడు, మండల తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ సంకరి సాయికృష్ణ తదితరులు మంత్రికి వినతిపత్రం అంద జేశారు. మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు సంబంధిత గ్రామాల ప్రజలు సమర్పించిన వినతి పత్రములను సమగ్రంగా పరిశీలించి తదుపరి చర్యలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, రాష్ట్ర కొప్పలవెలమ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అల్లు విజయ్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు రంది చిన్న రాము నాయుడు, నియోజకవర్గానికి చెందిన పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గర్భిణీలకు క్షయ వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా కేంద్రమైన విజయనగరంలోని ఘోషా అసుపత్రిలో శుక్రవారం గర్భిణీలకు క్షయ వ్యాధిపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణాధికారి డా. కె.రాణి హాజరై పలు విషయాలపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలపై గర్భిణీలకు వివరించారు. ఎవరికైనా లక్షణాలు ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులలో పరీక్షలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు పోషకాహారం తక్కువగా తీసుకోవడం వలన క్షయ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతీ నెలా తప్పనిసరిగా తనిఖీలను చేయించుకోవాలన్నారు. అలాగే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు

జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను, ఎమ్మెల్యే కోళ్ళ

విశాలాంధ్ర - జామి: రాజకీయాలకు అతీతంగా జామి మండలాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ చిన్న శ్రీను, ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారిలు తెలిపారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశానికి వీరిద్దరూ హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్హత కలిగిన లబ్ధిదారునికి న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలనపై నిర్ణయాన్ని ప్రజలు ప్రకటిస్తారని, ఎన్నికలు అనంతరం అందరం కలిసి సంక్షేమం, అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఏమైనా మండల పరిషత్‌కు నిధులు అవసరమైతే ప్రతిపాదనలు చేయాలన్నారు. ఎంపిపి సబ్బవరపు అరుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి గొర్లె సరయు, ఎంపిడివో నీలం అప్పల నాయుడు, తహశీల్దార్ భరత్‌కుమార్, వైస్‌ఎంపిపిలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేవల్లపాలెంలో అపారిశుధ్యం

- దోమలతో జీవనం చేస్తున్నామంటూ ప్రజలు ఆవేదన
- కానరాని పంచాయతీ కార్యదర్శి

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎస్.కోట సరిహద్దు గ్రామమైన రేవల్లపాలెంలో పారిశుధ్య సమస్యలు తీవ్రమైన రూపం దాల్చాయి. గత వారం రోజులుగా పంచాయతీ కార్యదర్శి గ్రామంలో కన్పించకపోవడం, పారిశుధ్యం, ఇతర అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. గ్రామంలో ఎటు చూసినా చెత్త కుప్పలు, కుళ్ళిన వ్యర్థ పదార్థాల దుర్వాసన, ప్లాస్టిక్ వస్తువులు విస్తరించి ఉన్నాయి. మండలంలోని అంతిమ గ్రామం కావడంతో ఇక్కడి సమస్యలు అధికారుల దృష్టికి రావడం లేదని, పారిశుద్ధ్యం, మురుగు నీటి పారుదల, రోడ్డు మరమ్మతులు వంటి ప్రాథమిక సదుపాయాలు కూడా అందుబాటులో లేవని గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శి తరచుగా గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నగర క్రమబద్ధీకరణకు సహకరించాలి

విశాలాంధ్ర - విజయనగరం: నగర క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం వివిధ ప్రాంతాలలో పర్యటించి స్థానిక ఇబ్బందులను గుర్తించారు. వెంటనే వాటి పరిష్కారానికి సిబ్బందికి తగు ఆదేశాలు ఇచ్చారు. బొంకుల దిబ్బ ప్రాంతంలో కొంతమంది చిరు వ్యాపారులు రహదారులను ఆక్రమించి వ్యాపారాల సాగించడాన్ని గమనించి వెంటనే అక్కడి నుండి ఖాళీ చేయించి ట్రాఫిక్ నకు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు సాగించుకోవాలని చెప్పారు. అలాగే తినిబండారాలు, టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ ముచ్చులు క్యారీ బ్యాగులు వంటివి వినియోగిస్తున్నారా లేదా అనేది గమనించారు. ఆ తర్వాత ప్లాస్టిక్ వినియోగం పై వ్యాపారస్తుల్లో అవగాహన కల్పించారు. అయితే ఒక దుకాణం వద్ద ముచ్చు కవర్లు వినియోగించడానికి గమనించి మందలించారు. ఇటువంటి పునరావృతం అయితే అపరాధ రుసుములు వసూలు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణ అత్యంత అవసరమని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెప్పారు.

జిల్లాలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - జయనగరం టౌన్: దేశ సరిహద్దుల్లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై, జిల్లా వ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, రైల్వే స్టేషన్లు, బస్టాండులు, లాడ్జిలు, హోటల్స్‌ను, వాహన తనిఖీలను ఆకస్మికంగా చేపట్టిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానస్పద వ్యక్తులు, ఇతర దేశాల నుండి జిల్లాకు విచ్చేసి, మకాం వేసిన విదేశీ వ్యక్తుల ఆచూకీ కనుగొనేందుకు ఆకస్మికంగా లాడ్జిలు, హోటల్స్‌లో తనిఖీలను ముమ్మరం చేసి, అనుమానస్పద వ్యక్తుల వేలి ముద్రలను చెక్ చేసి, వారి గుర్తింపు కార్డులను పరిశీలించారన్నారు. జిల్లా వ్యాప్తంగా 55 ప్రాంతాల్లో 91 లాడ్జిల్లోను, హోటల్స్‌ను తనిఖీలు చేపట్టామన్నారు. అదే విధంగా జిల్లాలోని 14 రైల్వే స్టేషన్లను, బస్టాండులను ఆకస్మింగా సందర్శించి, ప్లాట్ ఫామ్స్, రెస్ట్ రూమ్స్ వేచివున్న ప్రయాణికులు, అనుమానస్పద వ్యక్తుల బ్యాగులను, పార్సిల్స్‌ను బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీ చేసామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 1088 వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీలను విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాస రావు, బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, తనిఖీల్లో సంబంధిత సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఎస్టీఎఫ్ సిబ్బంది, మెరైన్ పోలీసులు, డాగ్, బాంబ్ స్క్వాడ్స్, డ్రోన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మాక్‌డ్రిల్

విశాలాంధ్ర - డెంకాడ: పోలీసులు వైద్యసిబ్బంది సంయుక్తంగా శుక్రవారం డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్తాన్, భారత్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు ప్రజలను ఏ విధంగా ఆసుపత్రికి తరలించాలి సిబ్బంది ఎలా చికిత్స అందించాలి అన్న దానిపై వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.అనూష, కిషోర్, స్టాఫ్‌నర్స్ మేరి కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ టి.గోవింద్, కె. దుర్గారావు, పి.ఎచ్.ఎస్.వరలక్ష్మి, వైద్య సిబ్బంది కుమారి, ఎం.ఎస్.పి. రాణి, సీతారాజు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-జామి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన సమావేశ భవనాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ళలలితకుమారి కలిసి శుక్రవారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ సాదారణ నిదులు, మండల పరిషత్ సాదారణ నిధులు కలిపి మొత్తం రూ.25లక్షలతో ఈసమావేశ మందిరాన్ని నిర్మించారు. ఈసందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ భవనంలో ఎసి ఏర్పాటుకు, ఫర్నీచర్, ఇతర సామాగ్రి నిమిత్తం అవసరమైన నిధులను మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు చేసుకోవాలని ఎంపిడివో నీలం అప్పలనాయుడుకు సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయుతోపాటు మండల పాలకవర్గం, అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విహారయాత్రలు శ్రేయస్కరం కాదు



విశాలాంధ్ర - బొబ్బిలి: ఆపరేషన్ సింధూర్ పేరుతో త్రివిధ దళాలు కలిసి తీవ్రవాదులపై విరుచుకుపడి మట్టుపెట్టిన సంగతి మన అందరికీ తెలిసిందేనని ఇటువంటి సమయంలో విహార యాత్రలు, తీర్థయాత్రలు శ్రేయస్కరం కాదని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. దేశ ప్రజల రక్షణం కోసం మన సైన్యం రేయింబవళ్లు కాపలకాస్తూ, శత్రుసైన్యం దాడులనుంచి మనల్ని కాపాడుతున్నారని ఇలాంటి సమయంలో ప్రజలు విహారయాత్రలకు వెళ్తే, మన రక్షణ సైన్యానికి మరింత భారం అవుతుందని అన్నారు. నియోజకవర్గం నుంచి చాలామంది ముందస్తుగా విహారయాత్రలకు ఏర్పాట్లు చేసుకున్నారని ఇప్పుడు యాత్రలకు వెళ్లడం శ్రేయస్కరం కాదన్నారు.

ప్రతీ గ్రామానికి సాగు, తాగునీరు

విశాలాంధ్ర - రాజాం: మాజీ మంత్రి, టీడీపీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం రాజాం మండలం గురవాం పంచాయతీ పరశురాంపేట వద్ద 70లక్షలతో మంజూరు అయిన బిటీ రోడ్డుకు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన పదినెలల్లోపు గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టిందని అన్నారు. గ్రామీణ ప్రాంతల అభివృద్ధి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఇప్పటికే రాజాం నియోజకవర్గంలో వందకోట్లతో అభివృద్ధి పనులు శరవేగంతో పూర్తవుతున్నాయన్నారు. ప్రతీ గ్రామానికి సాగు, త్రాగు నీరు అందిస్తామన్నారు. గత పాలకుల నిర్లయంక్ష్యంతో రాజాం నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిందన్నారు. అయిదేళ్లలో రాజాం నియోజకవర్గంను మోడల్ నియోజక వర్గంగా చేస్తామన్నారు. అనంతరం రాజాం తెదేపా కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. 50కి పైగా వచ్చిన వినతులలో రోడ్లు, కాలువలు, వీధిలైట్లు రెవెన్యూ సమస్యలపై వచ్చిన వినతులను స్వీకరించారు. .ఈ కార్యక్రమంలో గురవాన నారాయణ రావు, నంది సూర్య ప్రకాశరావు,కిమిడి అశోక్ కుమార్, లచ్చుభుక్త కృష్ణమూర్తి, గట్టి రఘు, దుప్పలపూడి శ్రీను, వల్లూరి గణేష్ నాగళ్ళ అప్పలనాయుడు జయరాం తదితరులు, జనసేన పార్టీ నాయకులు యుపి రాజు, బిజెపి నేతలు కోటగిరి నారాయణరావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయిలో అమరావతికి అగ్రస్థానం: ఎమ్మెల్యే కళా

విశాలాంధ్ర - చీపురుపల్లి: ప్రపంచస్థాయిలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతికి అగ్రస్థానం కల్పించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి జరుపు తున్నారని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కళా వెంకట్రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమరావతి అభివృద్ధి పట్ల జరుపుతున్న పనులను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని ఆరోపించారు. అభివృద్ధిని చేయడం చేతకాక గత పాలకులు అమరావతి ముక్కలు ముక్కలుగా చేసిన సంఘటన జనాలు ఇంకా మరిచిపోలేదు అన్నారు. జరుగుతున్న అభివృద్ధికి అడ్డుపడకుండా ప్రతిపక్షాలు సహకరించాలని ఆయన హితువు పలికారు. తాగునీటి సమస్యలు, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామ నాయుడు, గరివిడి మండల నాయకులు పైల బలరాం, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎం.వీ.జీ.ఆర్‌లో ముగిసిన ఫ్యాకల్టీ శిక్షణ

విశాలాంధ్ర - డెంకాడ: ఎంవీజీఆర్ కళాశాలలో డిఫెన్స్-ఓరియెంటెడ్ లీడర్షిప్ ట్రైనింగ్ కోసం సైకలాజికల్ ఆప్టిట్యూడ్ అసెస్మెంట్పై 5-రోజుల ఫ్యాకల్టీ శిక్షణా కార్యక్రమం అబ్బాకిల్ ట్రైనింగ్ కేంద్రం ప్రారంభోత్సవంతో విజయవంతంగా ముగిసింది. వివిధ విభాగాల నుండి 25 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. భారత నావికాదళ సేవల ఎంపిక బోర్డు (ఎస్ ఎస్ బి) మాజీ అధ్యక్షుడు రక్షణ మానసిక అంచనాలు, నాయకత్వ శిక్షణలో అనుభవజ్ఞుడైన నిపుణుడు కమోడోర్ మనోజ్ భూరియా (రిటైర్డ్) నేతృత్వంలో సమగ్ర శిక్షణా అనుభవాన్ని పొందారు. రక్షణ, నాయకత్వ పాత్రల కోసం విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించడానికి అధ్యాపక సభ్యుల అవగాహన, సంసిద్ధతను అంచనా వేయడానికి ఒక మూల్యాంకన పరీక్ష మనోజ్ భూరియా నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.వీ.జీ.ఆర్ -ప్రిన్సిపాల్ డా. ఆర్.రమేష్, వైస్-ప్రిన్సిపాల్ డా. వై.ఎం.సి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో మరింత అభివృద్ధి

విశాలాంధ్ర - విజయనగరం: అన్ని శాఖల సమన్వయంతో నగరపాలక సంస్థ మరింత అభివృద్ధి చెందే దిశగా కృషి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్న ఆయన వివిధ విభాగాల అధిపతులతో, సిబ్బందితో వేరువేరుగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. విభాగాల వారీగా ప్రగతి నివేదికలను పరిశీలించి, వాటి ఆధారంగా పలు సూచనలు సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాకిస్థాన్ ఉగ్రవాదులకు భారత్ సైన్యం తగిన బుద్ధి చెప్పింది

బీజేపీ నార్త్ పట్టణ అధ్యక్షులు ఇమంది సుధీర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పాకిస్తాన్ ఉగ్రవాదులకు భారత సైన్యం తగిన బుద్ధి చెప్పిందని బిజెపి విజయనగరం పట్టణ కన్వీనర్ ఇమంది సుధీర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు భారత ప్రభుత్వం గట్టి బుద్ధి చెప్పిందన్నారు. మిలటరీలో అత్యంత ప్రతిభావంతురాలిగా గుర్తింపు పొందిన కల్నల్ సోఫియా నేతృత్వంలో విజయవంతం కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆమె చాకచక్యంగా నడిపిన సైనిక దాడులతో ఉగ్రవాద స్థావరాలు నేలమట్టమయ్యాయని, ఉగ్రవాదులను మట్టుబెట్టడం భారత రక్షణ దళాల సత్తాకు నిదర్శనమన్నారు. భారత్ ప్రపంచంలో అగ్రగామిగా ఎదుగుతుండడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు. మన దేశం జోలికొస్తే ఎవరికైనా ఘోర పరాభవం తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పైడిరాజు, వేణుగోపాలం తదితరులు పాల్గొన్నారు

వైభవంగా శ్రీ తుడుపులమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ తుడుపులమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం10.09 గంటలకు హస్త నక్షత్రయుత అభిజిత్ లగ్నమందు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ హెూమాలు జరిపించి, శ్రీ తుడుపులమ్మ తల్లి ఆలయం, విగ్రహం, శిఖర ప్రతిష్టలతో పాటు యంత్రా స్థాపన, కళశ స్థాపన, పూర్ణాహుతి భక్తజనం ఆధ్వర్యంలో కనులు పండుగగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించగా భక్తులు దర్శించుకుని వారి మొక్కులను తీర్చుకున్నారు. అలాగే ఆలయ సమీపంలో మహిళల కోలాటం ఏర్పాటు చేయగా భక్తులు తిలకించారు.అలాగే మధ్యాహ్నం 12గంటల నుండి భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన మంగళవారం అమ్మవారి పండగ మహోత్సవం జరగనుంది.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - భోగాపురం : భోగాపురం పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పూర్వ విద్యార్థులు నిత్యావసర సరుకులు పంపిణీ చేసారు. భోగాపురం ఉన్నత పాఠశాల లో 82-83 సంవత్సరం లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యారులు 20 మంది పారిశుధ్య కార్మికులకు నిత్యసర సరుకులు అందించి తమ పెద్ద మనసు చాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులమందర కలసి సేవ కార్యకమాలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. మాకు వీలైనంతలో ఇకపై సేవ కార్యక్రమాలు విస్తృత పరచి ఆపన్నులను ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామిజిన్ని శ్రీనివాసరావు, అడపా ప్రసాద్, ఆచారి మాస్టారు, కాపుగంటి తాతీలు, అలాగే గ్రామ పెద్దలు కొమ్మూరు సుభూషణరావు, ఆళ్ల ఉదయబాబు, గుండపు సూరిబాబు, రౌతు వాసు తదితరులు పాల్గొన్నారు

అన్నా క్యాంటీన్‌లో ఔన్నత్యాన్ని మరింత పెంచాలి

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నాకేంటీన్‌లో ఔన్నత్యాన్ని మరింతగా పెంచే విధంగా చూడాలని సిబ్బందికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ వి.రవీంద్ర సూచించారు. ఈ మేరకు శుక్రవారం గోషాసుపత్రిలో ఉన్న అన్నాక్యాంటీన్‌ను కమిషనర్ పల్లి నల్లనయ్య తో కలిసి పరిశీలించారు. అన్నా క్యాంటీన్ పరిసరాలను గమనించారు. అయితే అక్కడ సరైన షెడ్డు లేకపోవడంతో అన్నార్తులు ఎండలోనే ఉండడాన్ని గమనించి తక్షణమే షెడ్ నిర్మాణానికి చొరవ చూపాలని అధికారులు ఆదేశించారు. అయితే కమిషనర్ పల్లి నల్లనయ్య స్పందిస్తూ ఇప్పటికే షెడ్ నిర్మాణానికి అవసరమైన టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే షెడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని సమాధానం ఇచ్చారు. దీంతో అక్కడ ఉన్న అన్నార్తులతో వివరాలను రాబట్టారు. ఆహారం వేడిగా, రుచిగా ఉన్నదా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అయితే అందరూ సానుకూలంగా స్పందించడంతో రీజినల్ డైరెక్టర్ వి.రవీంద్ర సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ. సూరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మధ్యాహ్న భోజనాన్ని అందించిన వైద్యాధికారిణి

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రతీ నెల 9వ తేదీన గర్భిణీలకు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలను నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. తనిఖీలకు వచ్చిన గర్భిణీలకు, వారి సహాయకులకు, వారిని తీసుకువచ్చిన ఆశాలకు మధ్యాహ్న భోజనాన్ని సాయి ప్రేమామృతంలో భాగంగా స్థానిక శ్రీసత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఈనెల తనిఖీలు శుక్రవారం జరుగగా అందరికీ భోజనాన్ని పిహెచ్‌సీ వైద్యాధికారిణి డా. ఆర్. సామ్రాజ్యలక్ష్మి అందించారు. తన సొంత నగదునువెచ్చించి తనవద్దకు వచ్చిన గర్భిణీలకు భోజనాన్ని వైద్యాదికారిణి ఏర్పాటు చేయడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈకార్యక్రమంలో శ్రీసత్యసాయి భజనమండలి కన్వీనర్ విన్నకోట నానాజీ, సామాజిక సేవకులు ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బేబి నాయన ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

విశాలాంధ్ర - బొబ్బిలి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) ప్రజాదర్బార్ నిర్వహించారు. పలు మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి గతంలో మంజూరు అయిన నిధులు గురించి ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటితో పాటు అదనంగా లివినపెంకి - ఆకులకట్టలి మధ్య రోడ్డు నిర్మాణానికి రూ2.90 కోట్లు మంజూరు అయినట్లు రహదారి భవనాలు శాఖ అధికారులు ఎమ్మెల్యే బేబి నాయనకి తెలిపారు. అమరావతిలో రహదారి భవనాలు శాఖ మంత్రిని కలిసి వీలైనంత త్వరగా నిధులు విడుదలయ్యేలా ప్రయత్నిస్తానని తెలిపారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు: జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన జిల్లా ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

మానవత్వం చాటుకున్న జాకేరు సర్పంచ్ దంపతులు

- బాధితుడికి రూ.3వేలు నిత్యావసర సరుకులు అందజేత

విశాలాంధ్ర - వేపాడ: ప్రస్తుతం సమాజంలో మానవత్వం మంటగలిపి కన్న తల్లిదండ్రులతో పాటు సొంత అన్నదమ్ములను కుటుంబీకులను మోసం చేసిన నేటి కాలంలో మానవత్వంతో కూడిన మనుషులు ఏ కొద్దిమందో ఉంటారు. అలాంటిది ఎవరికైనా కష్టం వస్తే నేనున్నాను అంటూ ఎందరికో అండగా నిలిచి అర్థిక సాయం చేయడంతో పాటు అలాంటి కుటుంబాలకు భరోసానిస్తూ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్న మంచి మనుషులుగా మండలంలోని జాకేరు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు అప్పల నాయుడులు నిలిచారు. శుక్రవారం శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రాంప్రసాద్ దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని శృంగవరపుకోట పట్టణ కేంద్రానికి చెందిన పాత్రికేయుడు దొడ్డి రామ సతీష్‌కు 25 కేజీలు బియ్యం, వంటనూనె పప్పు వంచదార, నిత్యావసర సరుకులతో పాటు రూ.3వేల రూపాయలను ఆర్థిక సాయంగా చేసి తన కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. అలాగే దాతలు ఎవరైనా సహకరించి అకుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అలాగే దాతలు ఎవరైనా ఆర్థిక సహాయం చేయాలనుకునేవారు ఫోన్ పే నెంబర్ 9849678182 నెంబర్‌కి చేసి ఆకుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు.

మోసాలకు పాల్పడితే ఫిర్యాదు చేయండి

లీగల్ మెట్రాలజీ సహాయ నియంత్రకులు రంగారెడ్డి

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: తూనికలు, కొలతల్లో మోసాలు జరిగితే వెంటనే వినియోగదారులు లీగల్ మెట్రాలజీ అధికారులను సంప్రదించాలని లీగల్ మెట్రాలజీ సహాయ నియంత్రణ అధికారి పీవీ రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. మే 20న జరిగే ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన కార్యక్రమాల్ని చేపట్టారు.ఇందులో భాగంగా నగరంలో శుక్రవారం ఆర్ రిలయన్స్ స్మార్ట్ బజార్ లో వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ నియంత్రణ అధికారి రంగారెడ్డి మాట్లాడుతూ తూనికలు, కొలతలలో జరిగే మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈనెల 8న ఆర్ అండ్ బి రైతు బజార్‌లో ధర్మ కాటన్ ఏర్పాటు చేసి వినియోగదారులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి రైతు బజార్ ఎస్టేట్ అధికారి అప్పలనాయుడు, లీగల్ మెట్రాలజీ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లికి వినతుల వెల్లువ

- పరిహారం చెల్లించాలంటూ రాళ్ళగుట్ట రైతుల అభ్యర్ధన
- జిందాల్ పరిశ్రమను తెరిపించి కార్మికులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - కొత్తవలస : కొత్తవలస మండలం, బలిఘట్టం గ్రామంలో ఎం.ఎస్.ఎం.ఇ పార్కు శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు స్తానిక ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి సమక్షంలో వివిధ రకాల సమస్యలపై ప్రజలు వినతిపత్రాలను అందజేశారు. బలిఘట్టం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 141లో వివిధ సబ్ డివిజన్లలో గల సుమారు 66.45 ఎకరాల భూముల్లో ఎం.ఎస్.ఎం.ఇ పార్కు ఏర్పాటుకు గానూ 2016లో రైతుల నుంచి ప్రభుత్వం సేకరించడం ప్రారంభించిందని, అప్పటి మార్కెట్ ధర ప్రకారం ఒక ఎకరాకు రూ.11లక్షల పరిహారాన్ని రైతులకిస్తామన్న ఒప్పందం మేరకు కొందరికి ప్రభుత్వం చెల్లించిందని, దాదాపు 23ఎకరాలకు చెందిన 60మంది రైతులకు ప్రభుత్వం కనీసం పరిహారం చెల్లింపులు నేటికీ చేయలేదని రైతులు చుక్క వరప్రసాద్, యడ్ల దేముడుబాబు, నారపాటి వెంకటరావు, మిడతాన దేముడు, యడ్ల అప్పారావు తదితరులు మంత్రికి విన్నవించారు. ఈ విషయమై ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్ వద్ద విలేఖరులు ప్రస్తావించగా 57.9ఎకరాల భూములకు సంభందించిన రైతులకు పూర్తి చెల్లింపులు చేశామని, తమ నుంచి ఏవిధమైన బకాయిలు లేవని చెప్పారు. కొందరు రైతులు తమకు ఏవిధమైన చెల్లింపులు, లావాదేవీలు జరగలేదని మంత్రివద్ద ఆవేదన వ్యక్తం చేసారు. అలాగే అప్పన్నపాలెం వద్దనున్న జిందాల్ పరిశ్రమను యాజమాన్యం అర్థాంతరంగా మూసేసి 300 మంది కార్మికుల్ని రోడ్డున పడేశారని, యాజమాన్యంతో మాట్లాడి పరిశ్రమను తెరిపించాలని, కార్మిక కుటుంభాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జేఏసి ప్రతినిధులు మంత్రిని అభ్యర్ధించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

థియేటర్‌లలో "జగదేకవీరుడు అతిలోకసుందరి" రీ రిలీజ్ హంగామా

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పద్మవిభూషణ్, డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి, అందాల తార శ్రీదేవి నటించిన "జగదేకవీరుడు అతిలోకసుందరి" సినిమా రిలీజ్ అయ్యి 35 సంవత్సరాలు పూర్తి చేసుకుని మళ్ళీ శుక్రవారం "రీరిలీజ్" అయిన సందర్భంగా.. మెగా అభిమానులు ఎన్ సీ ఎస్ థియేటర్ వద్ద శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిధులుగా విచ్చేసిన జనసేన నాయకులు గురాన అయ్యలు, థియేటర్ ఎండీ నారాయణం శ్రీనివాస్, థియేటర్ మేనేజర్ ఫిల్మ్ శ్రీను, వ్యాపారవేత్త గోవింద్ చేతులమీదుగా కేక్ కటింగ్, మజ్జిగ చలివేంద్రం, థియేటర్ స్టాఫ్‌కు గొడుగులు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత గురాన అయ్యలు మాట్లాడుతూ టాలీవుడ్ ఎవర్ గ్రీన్ క్లాసిక్స్‌లో జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమా ఒకటి అన్నారు. 1990లో వచ్చిన ఈ సినిమా అప్పట్లో సంచలనాలకు మారు పేరైందన్నారు. విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు త్యాడ రామకృష్ణారావు (బాలు) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత ప్రతినిధులు, జనసేన యువనాయకులు పిడుగు సతీష్, కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, లోపింటి కళ్యాణ్, ముదిలి శ్రీనివాస్,ఎంటి రాజేష్, లంకపట్నం కుమార్, రామకృష్ణ, పత్రి సాయికుమార్, నారంశెట్టి వెంకటరమణ, పవన్ కుమార్, సీనియర్ మెగాభిమానులు పత్తిగిల్లి వెంకటరమణ, చిన్న, రాంకీ, మహేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ 2వ అర్చకునిగా జాడ శ్రీనివాసరావుశర్మ

విశాలాంధ్ర - రాజాం: రాజాంలోని శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవాలయంకు 2 వ అర్చకునిగా జాడ శ్రీనివాసరావు శర్మ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. 2 వ అర్చకుడిని నియమించే నిమిత్తం దేవాదాయశాఖ కమీషనర్ నుంచి స్థానిక ఈవో కు ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు ఈవో మాధవరావు ఆయన్ను నియమించారు. దీంతో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు అర్చకునిగా వేమకోటి సూర్యనారాయణ శర్మ పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనతోపాటు 2 వ అర్చకుని సేవలు వినియోగించుకుంటున్నట్లు ఈవో మాధవరావు తెలిపారు. కార్యక్రమానికి ఆలయ అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ,ధర్మకర్త కుటుంబీకులు వాకచర్ల రాజా, వాకచర్ల దుర్గాప్రసాద్, కొత్తవలస మాజీ సర్పంచ్ శిమ్మ జగన్నాధం, స్థానికులు వెంపల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి ఎంపీడీవోగా త్రినాధరావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి నూతన మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎల్.త్రినాధరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రమోషన్‌లో భాగంగా చీపురుపల్లి ఎంపీడీవోగా ఆయన నూతనంగా నియామకమయ్యారు. ఇప్పటివరకు చీపురుపల్లి మండల ఇన్చార్జ్ ఎంపీడీవోగా ఇప్పలవలస సురేష్ బాధ్యతలు నిర్వహించారు.

ఎండలో ఉపాధి హామీ కూలీల కష్టాలు

మౌలిక సదుపాయాలు కరువు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎస్.కోట మండలం గోపాలపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కింద పనులు ఇవ్వడానికి కూలీల హాజరు నమోదు చేసే ప్రక్రియలో మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల కూలీలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గోపాలపల్లి గ్రామం వద్ద ఉన్న చెరువు భాగానికి ఆనుకున్న రోడ్డు ప్రదేశంలో, ఎండలో గంటల తరబడి నిలబడి, వందలాది మంది కూలీలు సూర్య తాపాన్ని భరించాల్సి వస్తోంది. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సాంబ తెలిపిన వివరాల ప్రకారం "జియో ట్యాగింగ్ ఉన్న ప్రదేశంలో మాత్రమే హాజరు నమోదు చేయాలి. అలా కాకపోతే, వారి హాజరు గుర్తించబడదు" అని చెప్పారు. అయితే, ఈ ప్రదేశంలో కూలీలు నిలబడటానికి గానీ, విశ్రాంతి తీసుకోవడానికి గానీ ఛాయా పందాలు, తాగునీరు లేదా టాయిలెట్ సదుపాయాలు ఏవీ లేవు. ఫలితంగా, ఉదయం 11 గంటల నుంచే మధ్యరోడ్డుపై నిలబడి, వేడికి గురవుతూ హాజరు కావల్సిన బాధాకర పరిస్థితి ఏర్పడింది. హాజరు నమోదు ప్రదేశంలో ఛాయా పందిరిలు ఏర్పాటు చేయాలని, తాగునీటి సదుపాయాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మరణించిన పోలీసు కుటుంబానికి చేయూత

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబులుగా పని చేస్తూ, రైలు నుండి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ ఇటీవల మరణించిన కొత్తవలస కానిస్టేబులు బి.రామకోటి సతీమణి రమకు చేయూతను అందించేందుకు పోలీసు సిబ్బంది ప్రోగు చేసిన రూ.1,48,300/- ల చెక్కును జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేస్తూ ప్రమాదవశాత్తులేదా అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది కొంత మొత్తాన్ని ప్రోగు చేసి, వారి కుటుంబాలకు చేయూత గా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఎఓ పి.శ్రీనివాసరావు, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ వర ప్రసాద్, మరణించిన పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరుమాలి సొసైటీలో అవకతవకలపై దర్యాప్తు

విశాలాంధ్ర -తెర్లాం: మండలంలో పెరుమాలి సొసైటీ లావాదేవీలలో అవకతవకలు జరిగాయని శివరామరాజు, కొరగంజి అశోక్ జిల్లా కలెక్టర్‌కి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా సహకారి అధికారి పిల్లి రమేష్, డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్ కే.రాంమూర్తి, వారి బృందం శుక్రవారం పెరుమాలి సొసైటీలో రెండో సారి బోర్డు మీటింగ్ కమిటీ సభ్యులతో దర్యాప్తు నిర్వహించారు. ఈ సమావేశానికి పూర్తి స్థాయిలో 1500 మంది కమిటీ సభ్యులు ఉన్నప్పటికీ ఒక 50 మంది మాత్రమే హాజరు అయ్యారు. శివరామరాజు మాట్లాడుతూ ఈ సొసైటీ అవకతవకల పై విజిలెన్స్ అధికారులతో ఎంక్వైరి నిర్వహించి నిజాలు వెలికితీయాలని కోరారు. కమిటీ సభ్యుడిగా సొసైటీలో జరుగుతున్న అవకతవకలను లెక్కలతో పాటు మా అనుమానాలు క్లియర్ అయ్యేటట్లు నివేదిక చూపించాలని కోరారు. అలాగే ప్రజలకు బ్యాంక్ ద్వారా లావాదేవీలను, లాభ- నష్టాలను కమిటీ సభ్యులకు వివరించాలని కోరారు. ఈ సొసైటీ లో పెద్ద మొత్తాన అవినీతి జరిగినట్లు ఆర్ టి యాక్ట్ ద్వారా మాకు వచ్చిన సమాచారం మేరకు కమిటీ సభ్యుల తీర్మాణం లేకుండా కొంతమంది మంది పెద్దలకు తల ఊపి కొన్ని లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు ఈ పత్రాల ద్వారా తెలుసుకున్నామని శివరామరాజు కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సహకారి అధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ ఈ వచ్చిన ఆరోపణలు అన్నింటిపై లోతుగా దర్యాప్తు చేసి, ఇక్కడ పని చేసిన బ్యాంక్ మేనేజర్ కానీ, సూపర్వైజర్ కానీ, సిబ్బంది పై అవకతవకలు చర్యలు తీసుకుంటామని అలాగే నగదు పక్క త్రోవ మళ్లించినట్లు అయితే రికవరీ చేయించడం జరుగుతుంది అని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అర్బన్ ఇంచార్జి సి హెచ్. పద్మజ, సి ఇ ఓ కే. రమాదేవి పాల్గొన్నారు.

ఉగ్ర సంస్థలన్నింటినీ మట్టు పెట్టాలి

విశాలాంధ్ర - చీపురుపల్లి: పాకిస్తాన్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలన్నింటిని పూర్తిగా మట్టుపెట్టాలని మాజీ ప్రభుత్వ విప్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ గద్దె బాబురావు అన్నారు. శుక్రవారం చీపురుపల్లిలో ఆపరేషన్ సింధూర ద్వారా ఉగ్రవాదులను మట్టు పెడుతున్న సైనికులకు ఆర్మీ దుస్తులతో సంఘీభావం తెలియజేస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ పతాకంతో సెల్యూట్ చేస్తూ మేరా భారత్ మహాన్, జై హింద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు గతంలో పార్లమెంటు పైన, ముంబై హెూటల్‌పైన పలుమార్లు దాడులు చేశారన్నారు. భారత ప్రభుత్వం పైన పాకిస్తాన్ పలుమార్లు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నప్పటికీ ఆ సంఘటనలను మళ్లీమళ్లీ పునరావృతం చేశారన్నారు. శాంతి స్వభావంతో భారత ప్రభుత్వం చేస్తున్న ఆలోచనను చేతగానితనముగా తీసుకోవడం వలన పాకిస్తాన్ ప్రభుత్వం ప్రస్తుతం తగిన శాస్తిని అనుభవిస్తుందని ఆయన అన్నారు. ఐఎస్ఎస్ విక్రాంత్ భారీ యుద్ధ నౌక ద్వారా తాజాగా సుదర్శన చక్రం పేరుతో ఉగ్రవాద సంస్థల పైన జరుపుతున్న దాడులు హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, జనసేన చీపురుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి విసనగిరి శ్రీనివాసరావు, కలిశెట్టిబడి ఎంపీటీసీ కలి శెట్టి సత్యనారాయణ, మీసాల ఎల్లం నాయుడు, లాయర్ సూర్యనారాయణ ,గుంటూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లెండిలో ఆంగ్ల భాషాధ్యయనంపై వర్క్‌షాప్

విశాలాంధ్ర - డెంకాడ: రాబోయే సవాళ్లకు ధీటుగా ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగించి ఈ డిజిటల్ యుగంలో భాషా అభ్యాసం జరగాలని నిట్ వరంగల్ ప్రొఫెసర్ స్ఫూర్తి అన్నారు. లెండి కళాశాల ఆంగ్ల ప్రయోగశాల వేదికగా వరంగల్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి) సహకారంతో డిజిటల్ యుగంలో ఆంగ్ల భాషాధ్యయనంపై ఓకరోజు వర్క్‌షాప్ నిర్వహించబడింది. డిజిటల్ యుగంలో గ్రామీణ విద్యార్థులు భాషా అభ్యాసానికి ఎలా అనుగుణంగా ఉంటారో దృష్టి సారించి సహకారంతో మొజిల్లా ఫౌండేషన్ నిధులు సమకూర్చిన పరిశోధన ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించబడినట్లు సంస్థ వైస్ ప్రిన్సిపాల్ డా హరిబాబు తమ్మినేనికి తెలిపారు. విద్యార్థులు తమ భాషా అభ్యాస ప్రయాణంలో, అలాగే వారి రియల్-టైమ్ ఇంజనీరింగ్ విద్యలో ఇది టీచ్ సాధనాలు, ఇంటర్నెట్‌పై వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రాజెక్ట్ అసోసియేట్ అమృత, శ్రావణి, రాణి, రేవతి, రాజా, షీబా, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా తానవరం నూకాంబికా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కోళ్ళ దంపతులు

విశాలాంధ్ర-జామి: మండలంలోని తానవరం గ్రామంలో గ్రామ దేవత శ్రీనూకాంబికా అమ్మవారి పున: విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గురువారం నుంచి జరుగుతున్న కార్యక్రమాలలో భాగంగా గురువారం వేదపండితుల మంత్రోఒచ్చరణ నడుమ హెూమాలను,పూజలను నిర్వహించారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి స్థానిక ఆహ్వానం మేరకు ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్లలలితకుమారి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి కె.బి.ఎ.రాంప్రసాద్ దంపతులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం కోళ్ళ దంపతులు పెళ్ళి రోజు కావడంతో స్థానిక టీడీపీ నేతలు, గ్రామ ప్రజలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మద్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు పందెముల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.